సాక్షి మెదక్

ఆదివారం । 15 । జూన్ । 2025

నాన్న.. నిలువు నిట్టాడు

సండే స్పెషల్

అమ్మ లాలనైతే.. నాన్నొక ఆలంబన. బుడిబుడి అడుగులేస్తున్నప్పుడు తడబడకుండా చేయిపట్టుకుని నడిపిస్తాడు. పడితే నిలబెడతాడు. నాన్నంటే ఉన్నత శిఖరాలను అధిరోహింపజేసే నిచ్చెన. పిల్లలు చూడబోయే బృందావనానికి బాటలు పరిచే రహదారి. కళ్లలో కాఠిన్యాన్ని, గొంతులోని గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ తప్పటడుగులు వేయకుండా నిలువరించే నిలువెత్తు పచ్చివెదురు బెత్తం నాన్న. ఆకాశన గాలికి రెపరెపలాడే పతంగి మాటున కనిపించని దారపు మాంజాలాంటిది ఆయన ప్రేమ. భుజాలపై ఎత్తుకుని ఈ ప్రపంచాన్ని పరిచయం చేస్తూ పిల్లల సంతోషాలకు లోలోపల మురిసిపోయే మురిపెం నాన్న. నాన్నంటే.. ఉంటే ఓ ధైర్యం.. లేకుంటే దైన్యం. నేడు ఫాదర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనాలు..





మెదక్‌లో విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు



చిన్నశంకరంపేట మండలం టీ.మాందాపూర్‌లో విత్తనాలు వేస్తూ..

కర్షకుల కోలా'హలం'

కోటి ఆశలతో వానాకాలం సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ఈసారి ముందస్తు వర్షాలు కురుస్తుండటంతో పలుచోట్ల దుక్కులు దున్ని మొక్కజొన్న విత్తనాలు వేస్తున్నారు. మరికొందరు వరి సాగుకు నార్లు పోస్తున్నారు. విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లతో జిల్లా కేంద్రంలోని దుకాణాల వద్ద సందడి నెలకొంది.

– మెదక్ కలెక్టరేట్/చిన్నశంకరంపేట

న్యూస్‌రీల్

రాజీయే రాజమార్గం



మాట్లాడుతున్న జడ్జి హేమలత

నర్సాపూర్: కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయం వృథా చేసుకోవడం కంటే ఇరువర్గాలు రాజీపడి కలిసిమెలిసి జీవించాలని జూనియర్ సివిల్ జడ్జి హేమలత హితవు పలికారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొని మాట్లాడారు. రాజీ చేసుకో తగిన కేసుల్లో ఇరువర్గాలు కోప తాపాలు మర్చిపోయి రాజీ కుదుర్చుకోవడం ఉత్తమమని చెప్పారు. అనంతరం పలు కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాఘవేందర్, ప్రభుత్వ సహాయ న్యాయవాది సుధాకర్ న్యాయవాదులు శ్రీనివాస్‌గౌడ్, మధుశ్రీ, సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగం తదితరులు పాల్గొన్నారు.

55 సార్లు రక్తదానం



రాజశేఖర్‌రెడ్డికి సర్టిఫికెట్ అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

రామాయంపేట(మెదక్): అంతర్జాతీయ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో శనివారం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి 55వసారి రక్తదానం చేశారు. ఈసందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రశంసించి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులతో పాటు జిల్లాకు చెందిన రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి'

మెదక్ కలెక్టరేట్: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకుడు కొట్టాల యాదగిరి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహంలో తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 17న జిల్లా కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో పాటు పలువురు రాష్ట్ర నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విజయేంద్రసాగర్, కుమారస్వామి, నర్సింలు, రమేష్‌గౌడ్, బండి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

19న వానాకాలం సాగుపై సెమినార్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

మెదక్ కలెక్టరేట్: ఈనెల 19న జరిగే వానాకాలం సాగుపై సెమినార్‌లో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం కేవల్ కిషన్ భవన్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. వ్యవసాయ రంగం.. ఎదుర్కొంటున్న సవాళ్ల అంశంపై అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజూ కృష్ణన్ ప్రసంగిస్తారని తెలిపారు. అలాగే అరిబండి ప్రసాద్‌రావు రచించిన 'నేను మన భూమి.. ఒక జీవన స్మృతి' పుస్తకాని ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. అనంతరం వానాకాలం సాగు– తీసుకోవాల్సిన చర్యలు అనే అంశంపై సెమినార్ జరుగుతుందన్నారు. సెమినార్‌కు శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అదనపు సంచాలకులు డాక్టర్ విజయకుమార్, రైతు సంఘం నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు.

మరోసారి పొడిగించండి

- పదవీకాలం పొడిగింపుపై సర్కారును కోరేందుకు డీసీసీబీ పాలకవర్గం
- ఇటీవల సర్వసభ్య సమావేశంలో తీర్మానం!
- రూ. ఐదు వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: తమ పదవీకాలాన్ని మరోసారి పొడిగించేలా ప్రభుత్వాన్ని కోరాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పాలకవర్గం భావిస్తోంది. ఈ మేరకు సర్వ సభ్య సమావేశంలో ఈ అంశంపై పాలకవర్గం నేతలు ప్రత్యేకంగా చర్చించారు. ఈ పాలకవర్గం పొడిగించిన పదవీకాలం గడువు ఆగస్టు 14తో ముగుస్తుంది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి జరిగే డీసీసీబీ జనరల్ బాడీ మీటింగ్ మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో తమ పదవీకాలం పొడిగింపు అంశాన్ని ప్రత్యేకంగా చర్చించారు. ఈ మేరకు తీర్మానం చేసినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 105 సహకార సంఘాలు (పీఏసీఎస్) ఉన్నాయి. ఈ సంఘాల నుంచి చైర్మన్, వైస్‌చైర్మన్లతోపాటు మరో 21 మంది డైరెక్టర్లు ఈ డీసీసీబీ పాలకవర్గంలో ఉన్నారు. అయితే వీరి పదవీ కాలం ఫిబ్రవరి 14తో ముగిసింది. అన్ని జిల్లాల డీసీసీబీల పాలకవర్గాల విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం వీరి పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించింది. అంటే ఆగస్టు 14 వరకు వీరు పదవిలో కొనసాగుతారు. దీంతో మరో ఆరు నెలలు పొడిగించుకునేందుకు ఇప్పట్నుంచే ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి ద్వారా సీఎంకు వినతిపత్రం ఇవ్వాలని పాలకవర్గం నేతలు భావిస్తున్నారు.



సంగారెడ్డిలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో..

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మళ్లీ సన్నాహాలు చేస్తోంది. గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను రెండు నెలల్లో నిర్వహించాలనే యోచనలో సర్కారు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికలు నిర్వహించాలంటే కనీసం మూడు నెలలైనా పడుతుంది. ఈ నేపథ్యంలో తమ పదవీకాలం పొడిగింపు ఉంటుందని పాలకవర్గం నేతలు భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత..సహకార ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నట్లు సంబంధిత వర్గాలు చర్చించుకుంటున్నాయి.

రూ. ఐదు వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం

రైతులకు పంట రుణాల మంజూరుతోపాటు, దీర్ఘకాలిక రుణాలు, వ్యవసాయ అనుబంధ బ్యాంకింగ్ సేవలు అందించడంతో డీసీసీబీది కీలక పాత్ర. ఇప్పటికే ఈ సహకార బ్యాంకు రూ.2,500 కోట్ల టర్నోవర్ లక్ష్యాన్ని చేరుకున్న విషయం విదితమే. ఈ వార్షిక టర్నోవర్‌ను రూ.ఐదు వేల కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పాలకవర్గం నేతలు చెబుతున్నారు. ఈ ఆర్థిక ఏడాదిలో కొత్త రైతులకు రూ.50 కోట్ల మేరకు పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బ్యాంకు లావాదేవీల ఆడిట్ రిపోర్టుకు ఈ సమావేశంలో పాలకవర్గం ఆమోదం తెలిపింది. మరోవైపు నష్టాల్లో ఉన్న పీఏసీఎస్‌లు తమ కార్యాచరణను పెంచుకుని లాభాల బాట పట్టేలా పనిచేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

ఎంపీ రఘునందన్‌రావు

శివ్వంపేట(నర్సాపూర్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని పెద్దగొట్టిముక్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీజేపీలో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరి నిర్మాణానికి రూ. 10 లక్షలు, హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. శివ్వంపేటలో కేంద్ర ప్రభుత్వ స్థలం ఉన్నందున తపాలా కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బీజేపీ నాయకుడు వినోద్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండల్‌రావు, మాజీ కౌన్సిలర్ సురేష్, మండల అధ్యక్షుడు రవి, నాయకులు నారాయణరెడ్డి, అంజనేయులుగౌడ్, భిక్షపతి, అశోక్, ఆంజనేయులు, నర్సింహారెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన వారితో ఎంపీ రఘునందన్‌రావు

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం: ఎస్పీ



మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో మొత్తం 5,277 కేసులు పరిష్కరించినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలు పోలీస్‌స్టేషన్లలో నమోదైన అండర్ ఇన్వెస్టిగేషన్, కోర్టు విచారణలో ఉన్న ఐపీసీ కేసులు 313, డ్రంకెన్ డ్రైవ్, ఎంవీఐ యాక్ట్, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన కేసులు 4,429, ఈ–పెట్టి కేసులు, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన, తదితర కేసులు 535 పరిష్కారం అయినట్లు తెలిపారు. అలాగే సైబర్ క్రైమ్‌కు సంబంధించి 65 కేసులు నమోదు కాగా, 60 కేసుల్లో రూ. 12,43,343 బాధితులకు అందజేసినట్లు వివరించారు. కేసుల పరిష్కారానికి కృషి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందించారు.

సామాజిక భద్రత కార్మికుల హక్కు

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

మెదక్ కలెక్టరేట్: సామాజిక భద్రత కార్మికుల హక్కు అని, రోజుకు రూ. 178తో కూలీలు బతికేదెట్లా అని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన సీఐటీయూ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందన్నారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల లాభాల కోసం కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. కార్మికుల హక్కులపై పాలకులు దాడి చేస్తూనే ఉన్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్‌తో 74 శాతం మందికి ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జూలై 9న దేశవ్యాప్త చేపట్టనున్నట్లు తెలిపారు. సమ్మెలో కార్మికులతో పాటు ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలమణి, మల్లేశం, ఉపాధ్యక్షులు కడారి నాగరాజు, మహేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులు నాగేందర్ రెడ్డి, సంతోష్, ఆసిఫ్, కోశాధికారి నర్సమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

వారంలో ఒక రోజు వస్తా

కార్మికశాఖ మంత్రి వివేక్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేటకు వారంలో ఒక రోజు వస్తానని, కార్యకర్తలకు అండగా నిలుస్తానని, కార్మికశాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ అన్నారు. శనివారం హైద్రాబాద్ నుంచి చెన్నూరు వెళుతూ.. మార్గమధ్యలో సిద్దిపేటలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి అందరం కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం తదితర పథకాలు ప్రజల్లోకి వెళ్లాయన్నారు. అన్ని సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే విధంగా, అందరం కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. తన తండ్రి వెంకటస్వామి ఎంపీగా ఉన్నప్పుడు సిద్దిపేటతో మంచి సంబంధాలు ఉండేవన్నారు. మళ్లీ సిద్దిపేటకు ఇన్‌చార్జిగా రావడం సంతోషంగా ఉందని అన్నారు.



మంత్రి వివేక్‌ను గజమాలతో సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

6,039 కేసుల పరిష్కారం

- రూ. 55,90,281 రికవరీ
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ
- లోక్ అదాలత్‌కు విశేష స్పందన

మెదక్ కలెక్టరేట్: కోర్టు కేసుల్లో రాజీయే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు, నర్సాపూర్, అల్లాదుర్గ కోర్టులలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా అన్నిరకాల కేసులు 6,039 పరిష్కరించినట్లు తెలిపారు. మొత్తం కేసుల్లో రూ. 55,90,281 రికవరీ చేసినట్లు వివరించారు. రాజీ పడడంతో ఇరువురికి న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్ఎం శుభవల్లి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సిరిసౌజన్య, స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ సాయి ప్రభాకర్, న్యాయవాదులు, అన్నికోర్టుల సిబ్బంది, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.



కేసు పరిష్కారం అనంతరం పత్రం అందజేస్తున్న న్యాయమూర్తి

వేగవంతంగా బియ్యం పంపిణీ

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ మున్సిపాలిటీ: మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో ప్రతి ఇంట్లో పండగ వాతావరణం నెలకొంటుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం మెదక్ మున్సిపాలిటీలోని 1వ వార్డు ఔరంగాబాద్ రేషన్‌షాపును పరిశీలించి మాట్లాడారు. సన్న బియ్యం పంపిణీని వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 2,16,716 రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. వీటి ద్వారా నెలకు సుమారు 4,522 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. మూడు నెలల కోటా కలిపి మొత్తం 13,922 మెట్రిక్ టన్నులు అవసరం కాగా, ఇందులో 8,800 మెట్రిక్ టన్నులను ఇప్పటికే 520 రేషన్ దుకాణాలకు తరలించినట్లు చెప్పారు. ఈనెల 30 బియ్యం పంపిణీ కొనసాగుతుందన్నారు. పేదల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేయడం గొప్ప విషయమని కొనియాడారు. సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'రైతు నేస్తం' ఏర్పాట్ల పరిశీలన

హవేళిఘణాపూర్(మెదక్): ఈనెల 16న మండల కేంద్రంలోని రైతువేదికలో జరిగే రైతు నేస్తం కార్యక్రమ ఏర్పాట్లను శనివారం కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. ఈసందర్భంగా వ్యవసాయ అధికారులతో మాట్లాడారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో మాట్లాడుతారని తెలిపారు. అన్ని రైతు నేస్తం కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారని, ప్రజాప్రతినిధులు, రైతులు హాజరయ్యేలా చూడాలని సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వినయ్ తదితరులు ఉన్నారు.



రేషన్‌షాపు వద్ద లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పాలన చేతకాకే కక్ష సాధింపు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి

రామాయంపేట(మెదక్): సీఎం రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతకాక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి ఆరోపించారు. ఇటీవల మృతిచెందిన పార్టీ కార్యకర్త నర్సింలు కుటుంబానికి శనివారం రూ. 2 లక్షల బీమా చెక్కును అందజేసి మాట్లాడారు. రైతు భరోసా, సన్నరకం ధాన్యానికి బోనస్ విషయంలో ప్రభుత్వం రైతులను మోసగించిందని మండిపడ్డారు. కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ కేటీఆర్‌కు రెండుసార్లు నోటీసులు జారీ చేశారన్నారు. మళ్లీ కేసీఆర్ సీఎం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. ఇప్పటికే ప్రజలు కాంగ్రెస్ పాలన పట్ల విముఖత వ్యక్తం చేస్తున్నారని ఎద్దేవాచేశారు. ఆర్థిక వ్యవస్థపై రేవంత్‌రెడ్డికి పట్టులేకపోవడంతో పరిపాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. రైతుల శ్రేయస్సు గురించి ఎంతమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు ముంబైలో మృతిచెందిన రాము కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆమె వెంట సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, మున్సిపల్ మాజీ చైర్మన్ జితేందర్‌గౌడ్, పార్టీ నిజాంపేట మండలశాఖ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, యూత్ విభాగం అధ్యక్షుడు జలంధర్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న పద్మారెడ్డి

మొక్కలు నాటిన ఆర్ఎం

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ విజయభాస్కర్ శనివారం డిపోను ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం మెదక్ బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా బస్టాండ్‌లోని స్టాల్స్, గ్యారేజీని పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి తగిన సూచనలు చేశారు. అలాగే డిపో పరిధిలోని చేగుంట, రామాయంపేట బస్టాండ్‌లను పరిశీలించారు. ఆయన వెంట డిపో మేనేజర్ సురేఖ, సుగుణాకర్, ఆఫీస్ సూపరింటెండెంట్ రాధాకిషన్, డిపో సిబ్బంది ఉన్నారు.



మొక్క నాటుతున్న ఆర్ఎం విజయభాస్కర్

సర్కారు కాలేజీ పిలుస్తోంది..!

- ప్రభుత్వ కళాశాలలో చదివితే బీటెక్ ఉచితం
- గ్రామాల్లో అధ్యాపకుల విస్తృత ప్రచారం

కౌడిపల్లి(నర్సాపూర్): 'ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివితే ఇంజనీరింగ్ ఉచితంగా చదవొచ్చు. ఇక్కడ పేద విద్యార్థులు మాత్రమే చదువుతారన్న భావన మీలో ఉండొద్దు. అనుభవం ఉన్న అధ్యాపకులతో నాణ్యమైన విద్యా బోధనతో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలు అందిస్తున్నాం. క్రీడలు, ఎన్ఎస్ఎస్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం'. అని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు అడ్మిషన్ల కోసం ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.

అన్ని గ్రూపులు.. సరిపడా అధ్యాపకులు

కౌడిపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఉన్నాయి. అన్ని సబ్జెక్టులకు కలిపి 11 మంది లెక్చరర్లు ఉండగా, ఇంగ్లీష్, తెలుగు మీడియంలో విద్యాబోధన చేస్తున్నారు. గతేడాది 320 మంది విద్యార్థులు విద్యనభ్యసించారు. ప్రస్తుతం ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయి. అయితే ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివి ఎప్‌సెట్ కన్వీనర్ కోటాలో సీటు వచ్చిన విద్యార్థులకు వందశాతం ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో బీటెక్ ఉచితంగా చదువుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. మిగితా వారికి అయితే కళాశాల స్థాయిని బట్టి కన్వీనర్ కోటాలో సీట్లు వచ్చిన విద్యార్థులకు రూ. 1 లక్ష నుంచి రూ. 2 లక్షలకు పైగా ఫీజు ఉంటుంది. కాగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో వివిధ ఇంజనీరింగ్ కళాశాలలో సీట్లు పొందిన విద్యార్థులకు ప్రభుత్వం కేవలం రూ. 35 వేలు మాత్రమే ఇస్తుంది. మిగితా డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది.



కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న లెక్చరర్లు

నాణ్యమైన బోధన అందిస్తున్నాం



ప్రైవేట్ కంటే ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యా బోధన అందుతుంది. ప్రభుత్వ కాలేజీలో చదివిన విద్యార్థులు బీటెక్ ఫ్రీగా చదవొచ్చు. ఈ విషయం చాలా మందికి తెలియక బీటెక్ కోసం రూ. లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు వినియోగించుకోవాలి. ఈఏడాది అడ్మిషన్లు జరుగుతున్నాయి.

– వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్

క్లుప్తంగా

నీట్‌లో మెరిసిన విద్యార్థి

ఎస్టీ కేటగిరిలో 2,821 ర్యాంక్


దామునాయక్

అక్కన్నపేట(హుస్నాబాద్): దేశ వ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షా ఫలితాల్లో గిరిజన విద్యార్థి సత్తా చాటారు. అక్కన్నపేట మండలం కేశనాయక్‌తండాకు చెందిన లావుడ్యా దామునాయక్ 408 మార్కులు సాధించిగా ఎస్టీ కేటగిరిలో 2,821వ ర్యాంక్ సాధించారు. ఓ మారుమూల గిరిజన తండా నుంచి నీట్‌లో ర్యాంకు సాధించడం పట్ల తండావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పత్రి ఎదుట ఆడ శిశువు



సంగారెడ్డి: గుర్తు తెలియని వ్యక్తులు రెండున్నర నెలల వయసున్న చనిపోయిన ఆడ శిశువును జిల్లా ఆస్పత్రి ముందు శనివారం రాత్రి వదిలి వెళ్లారు. శిశువు ఎవరు అనేది, అక్కడ ఎవరు వదిలి వెళ్లారనే కోణంలో పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


మేకల శంకర్

సంగారెడ్డి క్రైమ్: ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేష్ వివరాల ప్రకా రం... నవోదయకాలనీకి చెందిన మేకల శంకర్ (28) వృత్తిరీత్యా సేల్స్‌మేన్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. వచ్చిన ఆదాయంతో నిత్యం మద్యం తాగడం, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు చేయడం వల్ల విపరీతమైన అప్పులు పెరిగిపోవడంతో కుటుంబసభ్యులు మందలించారు. కోపంతో ఈ నెల1న ఉదయం 10గంటల సమయంలో ఇంటి నుంచి డ్యూటీకి వెళ్లి తిరిగి రాలేదు. శంకర్ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మద్దూరు(హుస్నాబాద్): ఆరోగ్యం సహకరించడం లేదని మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని రెడ్యానాయక్ తండాలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... దూల్మిట్ట మండలంలోని రెడ్యానాయక్ తండాకు చెందిన జాటోత్ చందు(50) అనే వ్యక్తి ఏడు నెలలుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నారు మడిపై అడవి పందుల దాడి

అక్కన్నపేట(హుస్నాబాద్): గంపెడు ఆశలతో రైతులు సాగుకు సిద్ధం చేస్తున్న వరి నారు మళ్లను రాత్రికి రాత్రే అడవి పందులు ధ్వంసం చేశాయి. ఓ వైపు పంటలు చేతికందే సమయంలో ప్రకృతి ప్రకోపంతో నష్టాలు వస్తుండగా.. మరోవైపు జంతువులతోనూ తీవ్ర నష్టం జరుగుతోంది. శుక్రవారం అర్ధరాత్రి అక్కన్నపేట మండలం పంతుల్‌తండా గ్రామ పరిధిలోని ధరావత్ తండాలో ధరావత్ విజయ్ అనే రైతు నాలుగు బస్తాల నారును పొట్టు పొట్టు తొక్కి ధ్వంసం చేశాయి. వరి సాగు చేసేందుకు పొలాలు దున్ని సిద్ధంగా ఉంచిన క్రమంలో ఇలా అడవి పందులు నారు మడి ధ్వంసం చేయడంతో రైతు ఆందోళన చెందుతున్నాడు. అధికారులు పరిహారం అందించాలని బాధిత రైతు కోరుతున్నారు. పందుల బెడద నుంచి కాపాడాలని పలువురు రైతులు వాపోయారు.

నాన్న.. నిలువు నిట్టాడు

నేడు ఫాదర్స్‌డే సందర్భంగా విజేతల కథనాలు

నాన్నలో కనిపించని ప్రేమ, ఆప్యాయత, మమత, తెలియని ధైర్యం, అనురాగం దాగి ఉంటుంది. బిడ్డలు బుడి బుడి అడుగులు వేస్తుంటే సంబురపడతాడు. తన బాధలను కనిపించకుండా భార్యాపిల్లలను సంతోష పెట్టడానికి బాధ్యతలను మోస్తుంటాడు. రెక్కలు వచ్చిన పిల్లలకు మార్గనిర్దేశం చేస్తుంటాడు. పిల్లల భవిష్యత్తుకు చక్కని దారులు దొరికితే మురిసిపోతాడు. పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో బాధలు, మరెన్నో వేదనలను బయటపెట్టకుండా కుమిలిపోయే ప్రతి నాన్న మనసు గుండె లోతుల్లోకి ప్రతి బిడ్డ తొంగి చూస్తేనే నాన్న విలువ తెలుస్తుంది. ఫాదర్స్ డే సందర్భంగా నాన్నకు ప్రేమతో...

- పిల్లల భవిష్యత్‌కు అన్నీ తానై
- కష్టపడి చదివిస్తూ ఉన్నత స్థాయికి
- నాన్న కోరిక మేరకు ఆయా రంగాల్లో రాణిస్తున్న పిల్లలు
- తండ్రి స్ఫూర్తితో ముందుకు

నాన్న ఆకాంక్ష మేరకు డాక్టరయ్యా..


అమ్మానాన్నతో డాక్టర్ స్రవంతి

హుస్నాబాద్‌రూరల్: ఆడపిల్లకు చదువెందుకు పెళ్లి చేస్తే ఓ ఇంటికి వెళుతుందనే రోజుల్లో.. ఓ గుమస్తా తన బిడ్డను డాక్టర్ చదివించాలనే ఆకాంక్షతో కూతురు పట్టుదలతో వైద్య విద్య పూర్తి చేసింది. ప్రభుత్వ వైద్యురాలిగా పేదలకు ఉచిత వైద్య సేవలు అందించి నాన్న కలలను సాకారం చేస్తోంది వైద్యురాలు స్రవంతి. హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామానికి చెందిన కానుగుల మోహన్, లక్ష్మీ దంపతులకు ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు. మోహన్ దుకాణంలో గుమస్తాగా పని చేసి ముగ్గురిని ఉన్నత చదువులు చదివించాడు. పెద్ద కూతురు స్రవంతి చొప్పదండి నవోదయలో 10వ తరగతి వరకు చదివింది. మంచి మార్కులు తెచ్చుకోవడంతో కార్పొరేట్ కాలేజీ వారు ఇంటర్మీడియెట్‌లో ఉచిత సీటు ఇచ్చారు. గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, ఉస్మానియాలో పీజీ వైద్య విద్య పూర్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వైద్యుల నియామకం చేపట్టడంతో అందులో భాగంగా కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో అసిస్టెంట్ సివిల్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నాన్న ఆకాంక్షను స్రవంతి నిలబెట్టడంతో ఆ తండ్రి ఆనందానికి అవధులు లేవు. మరో కూతురు, కొడుకును కూడా పీజీ చేయించడం నాన్న గొప్పదనం.

తండ్రి కష్టానికి ప్రతి ఫలం


తల్లిదండ్రులు, సోదరితో సుమంత్ శర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన వేలేటి శ్రీనివాస్ శర్మ, శ్రీలీలకు కుమారుడు సుమంత్ శర్మ, కూతురు సుస్మిత ఉన్నారు. తండ్రి ఆర్టీసీ కండక్టర్‌గా, తల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. వీరిది సాధారణ కుటుంబం. సుమంత్ శర్మ చిన్నప్పటి నుంచి చురుకైన వాడు. ఇంటర్‌లో రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించాడు. కేరళలో ఎన్ఐటీ పూర్తి చేసి, సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నాడు. సివిల్స్‌లో ర్యాంకు రాకపోవడంతో సీఏపీఎఫ్‌లో జాతీయ స్థాయిలో రాణించి కేంద్ర బలగాల దళంలో అసిస్టెంట్ కమాండెంట్‌గా సెలెక్ట్ అయ్యాడు. కూతురు సుస్మిత అమెరికాలో సాఫ్ట్‌వేర్‌గా స్థిరపడ్డారు. సుమంత్ చిన్నప్పటి నుంచి ఐఏఎస్ లక్ష్యంగా పెట్టుకుని శ్రమించాడు. విఫలం కావడంతో సీఏపీఎఫ్‌లో జాతీయ స్థాయిలో రాణించి ఐపీఎస్‌గా అసిస్టెంట్ కమాండెంట్‌గా సెలెక్ట్ అయ్యాడు.

పిల్లల చదువే లక్ష్యం


తండ్రి కాట్రోత్ శివరాంతో కొడుకు, కూతురు

కొడిపల్లి(నర్సాపూర్): గిరిజన రైతు తన పిల్లల చదువే లక్ష్యంగా కష్టం చేసి చదివిస్తున్నాడు. నలుగురు పిల్లలు సైతం తల్లిదండ్రుల కష్టాన్ని వమ్ముచేయకుండా పెద్ద చదువులు చదువుతున్నారు. కొడిపల్లి మండలం సలాబత్‌పూర్ భద్యతండాకు చెందిన కాట్రోత్ శివరాం, గంసి దంపతులది వ్యవసాయ కుటుంబం. ఎకరం సాగు భూమి ఉండగా కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ నలుగురు పిల్లలను చదివిస్తున్నారు. పెద్దకూతురు అనిత సిరిసిల్ల ప్రభుత్వ కళాశాలలో నర్సింగ్ చదువుతోంది. కొడుకు విజయ్‌కుమార్ కాకినాడలో ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండో కూతురు సుమలత సిద్దిపేటలోని సురభి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతోంది. చిన్న కొడుకు రాహుల్ ఖమ్మం ఎస్టీ సీఓఈ గురుకుల కళాశాలలో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. పిల్లలు ఉన్నత చదువులు చదువుతుండటంతో ఆ తండ్రి సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

చిరు వ్యాపారం చేస్తూ..


కుమారుడు రమేష్‌తో తల్లిదండ్రులు బిచ్చయ్య, బాగమ్మ

ఝరాసంగం(జహీరాబాద్): ఓ చిరు వ్యాపారి కుమారుడిని ప్రయోజకుడిగా తీర్చిదిద్దాడు. మండల కేంద్రమైన ఝరాసంగం గ్రామానికి చెందిన బిచ్చయ్య అదే గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో పండ్ల దుకాణం ఏర్పాటు చేసుకుని వ్యాపారం నిర్వహిస్తున్నాడు. తాను పడిన కష్టం కొడుకు పడొద్దనే ఆలోచనతో ఉన్నత చదువులు చదివించాడు. కుమారుడు రమేష్ పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సంపాదించాడు. ప్రస్తుతం మేడారం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు.

ఉన్నత స్థితికి చేర్చాడు


చిరంజీవి


కొంపెల్లి నర్సయ్య


స్వప్న, లైబ్రేరియన్

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన కొంపెల్లి నర్సయ్య అనే నిరుపేద సన్నకారు రైతు. అతనికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. తమకున్న ఎకరన్నర భూమిలో పంటలు సాగు చేస్తూ పిల్లలను ప్రయోజకులను చేశాడు. కుమారుడు చిరంజీవి పీజీ, బీఈడీ చేసి 2014లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. 2019లో గ్రూప్–2లో ప్రతిభ కనబరిచి ఎక్సైజ్ ఎస్ఐ ఉద్యోగం పొందాడు. కుమార్తె స్వప్న మొదట కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించిది. మళ్లీ ఉద్యోగాలకు పరీక్షలు రాసింది. ప్రస్తుతం గురుకుల పాఠశాలలో లైబ్రేరియన్‌గా ఉద్యోగం చేస్తుంది.

వ్యవసాయం చేస్తూ చదివించాడు


కొమరయ్యతో కుమారులు వెంకటేష్, హరికృష్ణ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్ల గ్రామానికి చెందిన సీత కొమరయ్యకు ఇద్దరు కుమారులు వెంకటేష్, హరికృష్ణ. తనకున్న భూమిలో వ్యవసాయం చేస్తూ వారిని విద్యావంతులను చేశారు. వారిని ఉన్నతమైన స్థాయిలో చూడాలనే కోరికతో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో విదేశాలకు వెళ్లి పని చేసి వారిని చదివించాడు. పెద్ద కుమారుడు గ్రూప్ 1లో మంచి ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా పల్వంచ విద్యుత్ కేంద్రంలో ఏఈగా పని చేస్తున్నాడు. రెండవ కుమారుడు హరికృష్ణ గ్రూప్ 2 లో 184వ ర్యాంకు సాధించాడు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయింది. త్వరలో ప్రభుత్వ ఉద్యోగం పొందనున్నాడు. తండ్రి కష్టానికి కుమారుల ప్రతిభ తోడవడంతో కొమరయ్య ఆశయం నెరవేరింది.

తల్లి లేని లోటు కనిపించకుండా..


కొడుకు మల్లికార్జున్‌రెడ్డితో నర్సింహా రెడ్డి

జహీరాబాద్ టౌన్: ఆ తండ్రి పిల్లలకు తల్లిలేని లోటు కనపడకుండా చూసుకున్నాడు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ర్యాకల్‌కు చెందిన కోనేరు నర్సింహా రెడ్డికి కొడుకు, కూతురు. చదువుల కోసం జహీరాబాద్‌కు వచ్చి పట్టణంలోని వెంకటరమణ నగర్ కాలనీలో ఉంటున్నాడు. పిల్లలకు మంచి విద్య, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఇక్కడే ఉంటున్నాడు. ఐదారు సంవత్సరాల క్రితం భార్య చనిపోయింది. తల్లిలేని లోటు కనిపించకుండా జాగ్రత్త పడ్డాడు. ఇద్దరిని బాగా చదివించాడు. కూతురికి వైభవంగా పెళ్లి జరిపించాడు. కొడుకు ఫార్మా కంపెనీలో మంచి ఉద్యోగం చేస్తున్నాడు. కొడుకు కె.మల్లికార్జున్‌రెడ్డి తండ్రికి ధైర్యం చెప్పే స్థాయికి ఎదగడంతో ఆయన సంతోషంగా ఉన్నాడు.

నాన్న స్ఫూర్తితో ఉద్యోగంలోకి


జిల్లా పంచాయతీ అధికారి, దేవకీదేవి

ఎన్ని కష్టాలొచ్చినా, కన్నీళ్లు వచ్చినా.. ఆనందం అనే ఉయ్యాలలో నన్ను పెంచిన నాన్న స్ఫూర్తితోనే నేడు ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నానంటూ జిల్లా పంచాయతి అధికారి దేవకీదేవి తెలిపారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు పరిధిలోని పచ్చునూరు మా గ్రామం. మా నాన్న బండి కొమురయ్య ప్రభుత్వ డిప్యూటీ తహసీల్దార్. కాని నాన్న పదవీ విరమణ పొందకముందే చనిపోయారు. నాన్న ఆడపిల్లలు చదువుకోవాలని, చదువు చీకట్లో దీపం వంటిదని ప్రోత్సహించేవారు. నాన్న చనిపోవడంతో ఎలాగైనా నాన్న కోరిక మేరకు 2002లో ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగం సాధించాను. అంతటితో ఆగకుండా బాగా చదివి 2005లో గ్రూప్ –2 ఉద్యోగం సాధించి ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కింది. నా పెళ్లికి కూడా ఆస్తులు, అంతస్తులు చూడకుండా చదువుకున్న వారికి ఇచ్చి పెళ్లి చేశారు.

తండ్రి జ్ఞాపకార్థంగా సేవా కార్యక్రమాలు


తండ్రి రామరాజు పేరిట ట్రస్టు


డాక్టర్ శ్రీనివాస్

సిద్దిపేటజోన్: కష్టపడి చదివించి ప్రయోజకుడిగా చేసిన తన తండ్రి రుణం కొంతైనా తీర్చుకొనేందుకు ప్రముఖ న్యాయవాది ఎర్రమరాజు రామరాజు కుమారుడు శ్రీనివాస్ కుమార్ పడుతున్న తపన ఆదర్శనీయం. పట్టణానికి చెందిన రామరాజు, మధుసూదనాదేవి కుమారుడు శ్రీనివాస్ ప్రముఖ గుండె వైద్యులుగా కొనసాగుతున్నారు. తండ్రి 2015లో చనిపోయిన తర్వాత ఆయన పేరిట సేవా కార్యక్రమాల కోసం 2016లో ట్రస్ట్ ఏర్పాటు చేశారు. ప్రతి గురువారం తండ్రి పుట్టిన ఊరు సిద్దిపేటలో పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ఇప్పటి వరకు 25 వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. తండ్రి న్యాయవాది కావడంతో ఆయన జ్ఞాపకార్థంగా రూ.40లక్షలతో కోర్టు ప్రాంగణంలో రీడింగ్ రూమ్ నిర్మించారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన విలువైన స్థలాన్ని తండ్రి పేరిట ప్రభుత్వ వసతి గృహానికి డైనింగ్ హాల్ కోసం ఉచితంగా అందించారు. తండ్రి జ్ఞాపకాలను సిద్దిపేట ప్రజలు మర్చిపోకుండా ప్రేమతో సేవాభావంతో సాగుతున్నారు.

నాన్న స్ఫూర్తితో సామాజిక సేవ


వృద్ధాశ్రమంలో వృద్ధులతో పాండురంగారావు

రామచంద్ర పురం(పటాన్‌చెరు): జన్మనిచ్చింది తండ్రే. మనం ఏ స్థాయిలో ఉన్నా మన కోసం పడిన తండ్రి కష్టాన్ని ఎప్పటికీ మరువద్దని బెల్ రిటైర్డ్ అధికారి అల్లం పాండురంగారావు పేర్కొన్నారు. మా తండ్రి అల్లం వెంకటేశ్వర్ రావు 1993లో మృతి చెందారు. ఆయన కోరిక మేరకే నాటి నుంచి నేటి వరకు సామాజిక సేవలో ముందున్నాను. ప్రధానంగా మానాన్న ఎక్కువగా వృద్ధులకు సహాయం చేయాలని చెప్పేవారు. అందులో భాగంగా గత 20 ఏళ్లుగా వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్నా. అమ్మ వెంకట భాగవతమ్మ 2023లో మృతి చెందారు. ఆమె కోరిక మేరకు నా మూడు అంతస్తుల భవనంను వృద్ధాశ్రమంగా మార్చేశాను. నేత్రదానం, అవయదానం చేయించడంలో నావంతు కృషి చేస్తున్నాను. ఇప్పటివరకు 3200 నేత్రదానాలు చేయించారు. తల్లిదండ్రుల కోరికలను తీర్చినప్పుడే తృప్తినిస్తుంది.

స్కూటీని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

భార్య మృతి, భర్త, ఇద్దరు పిల్లలకు గాయాలు


శ్రావణి (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: షాపింగ్ కోసం ఓ కుటుంబం స్కూటీపై వెళ్తుండగా ప్రైవేట్ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్త, ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుభాష్ వివరాల ప్రకారం ... జగిత్యాలకు చెందిన పవన్ కుటుంబ సభ్యులతో కలిసి అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం వాల్యూ జోన్‌లో షాపింగ్ చేసేందుకు స్కూటీపై పవన్, అతని భార్య శ్రావణి (34) తోపాటు ఇద్దరు పిల్లలు దీపశ్రీ (7), రిశస్వి (5) కలిసి వస్తున్నారు. ఈ క్రమంలో కిష్టారెడ్డిపేట నుంచి సర్వీస్ రోడ్ మీదుగా వెళ్తుండగా ముత్తంగి ఓఆర్ఆర్ సమీపంలో గల బ్రిడ్జ్ వద్దకు రాగానే వెనుక నుంచి స్కూటీని బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రావణి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. భర్త పవన్, ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దశ దినకర్మకు వెళ్లి అనంతలోకాలకు

నీట మునిగి వృద్ధుడు మృతి


శంకరయ్య (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం కొప్పులపల్లిలో తీవ్ర విషాదం నెలకొంది. వరుసకు కుమారుడయ్యే యువకుడి దశ దినకర్మరోజు చెరువులో స్నానానికి దిగిన వృద్ధుడు నీట మునిగి మృత్యువాత పడ్డాడు. ఎస్సై వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మల్ల నాగరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మృత్యువాతపడటంతో శనివారం కుటుంబసభ్యులు దశ దిన కర్మ నిర్వహిస్తున్నారు. మృతుడి కుటుంబీకులతో పాటు పాలివారు స్నానానికి గ్రామ శివారులోని ఊర చెరువు వద్దకు వెళ్లారు. చెరువులో స్నానం చేస్తుండగా మృతుడికి వరుసకు పెదనాన్న అయ్యే మల్ల శంకరయ్య(62) ప్రమాదవశాత్తు నీటిలో మునిగాడు. గమనించిన చుట్టుపక్కల వారు అతడ్ని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. నీటిలో మునిగి ఊపిరాడక మృత్యువాత పడ్డాడు. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. చిన్న కూతురు కల్యాణి ఎంగేజ్‌మెంట్ ఇటీవల జరిగింది.మరికొద్ది రోజుల్లో పెళ్లి భాజాలు మోగాల్సిన ఇంట్లో మృత్యుఘంటికలు మోగడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుదాఘాతంతో క్లీనర్ మృతి

జిన్నారం (పటాన్‌చెరు): టిప్పర్ లారీ క్లీనర్ సజీవదహనమైన ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖాజీపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి వివరాల ప్రకారం... బిల్యాని కంకర క్రషర్‌లో కొంత కాలంగా మధ్యప్రదేశ్‌కు చెందిన రామ్‌సుజన్ (38) టిప్పర్ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున కంకర క్రషర్ వద్ద అన్‌లోడ్ చేస్తున్న సమయంలో ఒక్కసారిగా పైకి లేచిన హైడ్రాలిక్ హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో క్లీనర్ రామ్‌సుజన్ విద్యుత్ షాక్ గురై కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పెద్దఎత్తున చెలరేగిన మంటల్లో టిప్పర్‌తో పాటు క్లీనర్ కాలిపోయాడు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్రషర్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో కూలీ మృతి

పటాన్‌చెరు టౌన్: విద్యుదాఘాతంతో కూలీ మృతిచెందాడు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ స్వామి గౌడ్ వివరాల ప్రకారం... ఒడిశాకు చెందిన దినేష్ బోయి(22) బతుకుదెరువు కోసం మూడు నెలల క్రితం వచ్చి తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో ఉంటూ స్థానికంగా డైమండ్ బ్రిక్స్ కంపెనీలో కూలీగా చేరాడు. అయితే రోజు మాదిరిగానే కాంక్రీట్ మిక్సింగ్ యంత్రం శుభ్రం చేస్తుండగా శనివారం ఉదయం విద్యుత్ షాక్ తగిలింది. తీవ్రంగా గాయపడిన దినేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బంగారు భానుడు

దుబ్బాకటౌన్: కారు చీకట్లో కాంతి రేఖలా వెలుగుతున్న భానుడు.. నీటి తనువులో స్వర్ణంలా మెరిశాడు. చూసిన ప్రతి ఒక్కరి మనసును ఇట్టే కట్టిపడేశాడు. ఈ సుందరమైన దృశ్యాన్ని శనివారం సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

నాల్‌సాబ్‌గడ్డలో గుర్తు తెలియని మృతదేహం

సంగారెడ్డి క్రైమ్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... పట్టణంలోని నాల్‌సాబ్‌గడ్డ పరిసర ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి (50)మృతి చెందినట్లు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నీలి రంగు టీ షర్ట్, నలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడు.

మహబూబ్ సాగర్ చెరువులో..

సంగారెడ్డి క్రైమ్: ఇరవై రోజుల కింద తప్పిపోయిన వ్యక్తి సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్ సాగర్ చెరువులో గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహంగా కనిపించాడు. సీఐ రమేష్ వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్ చెందిన పద్మశాలి శ్రీనివాస్(42), వృత్తిరీత్యా ప్రముఖ టీవీ చానల్‌లో కెమెరామెన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది గత నెల 21న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ నెల 12న ఉదయం 10గంటల సమయంలో స్థానిక మహబూబ్ సాగర్ చెరువులో కుళ్లిపోయిన మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని ఐడీ కార్డ్ ఆధారంగా కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు.

విప్లవ వీరుడు చేగువేరా

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్


చేగువేరా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): అణగారిన ప్రజల కోసం పోరాడిన విప్లవ వీరుడు చేగువేరా అని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్ పేర్కొన్నారు. చేగువేరా జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పులమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయన మాటలు ఒక శక్తి, చేతలు ఒక స్ఫూర్తి అని పేర్కొన్నారు. చేగువేరా అర్జెంటీనా మార్క్సిస్ట్ విప్లవకారుడు, వైద్యుడు, రచయిత, గెరిల్లా నాయకుడన్నారు. చిన్న వయసులోనే లాటిన్ అమెరికా పర్యటించి అక్కడి దారిద్ర్యం , అసమానతలను చూసి చలించిపోయాడని తెలిపారు. చేగువేరా జీవిత విశేషాలు, సిద్ధాంతాలు, ఆచరణను యువత తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్, ముజీబ్, మాస్టర్ చిన్నా తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతోనే చెరుకుకు తెగుళ్లు

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్త విజయ్‌కుమార్


చెరుకు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త విజయ్‌కుమార్, రైతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల చెరుకు పంటకు తెగుళ్లు సోకి దెబ్బ తింటుందని బసంత్‌పూర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. నివారణ చర్యలు చేపట్టకపోతే దిగుబడులు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం పర్యటించిన ఆయన చెరుకు పంటకు సోకిన మొవ్వ తెగుళ్లను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. మే, జూన్‌లో అధిక వర్షం కురవడం వల్ల తెగుళ్ల ఉధృతి అధికంగా ఉంటుందని, 93వి 297, 3102 రకాలకు అధికంగా సోకుతాయన్నారు. ఈ రకాలను ఈ ప్రాంత రైతులు అధికంగా సాగు చేశారన్నారు. తెగుళ్ల సోకిన పంట ఆకుల మొదలు భాగం తెల్లగా మారి విప్పుకోకుండా చుట్టుకుపోతాయన్నారు. ఆకులు పాలిపోయి మొక్క ఎదుగుదల లేక చచ్చిపోతుందని, మొవ్వ తెగులు గాలి, వర్షం ద్వారా వ్యాప్తి చెందుతుందని వివరించారు. నివారణ కోసం అమీస్టార్ టాప్ 200 మిల్లీ లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలని, నాలుగు నుంచి ఏడు రోజుల తర్వాత బోరాన్ 200 మిల్లీ లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం కోరజెన్ 150మిల్లీ లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే మొవ్వ తెగుళ్లను పూర్తిగా నివారించవచ్చని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి హత్య

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని వ్యక్తిని హత్య చేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సదాశివనగర్ కాలనీలో ఓ ఇంట్లోకి 20 రోజుల క్రితం కర్ణాటక నుంచి వచ్చిన వ్యక్తి అద్దెకు ఉంటున్నాడు. అయితే రెండు రోజులుగా ఇంటికి తాళం వేసి ఉంది. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో కాలనీవాసులు ఇంటి యజమానికి తెలిపారు. యజమాని వచ్చి ఇంటి తలుపులు తీసి చూడగా ఇంట్లో అద్దెకు ఉన్న వ్యక్తి రక్తం మడుగులో మృతి చెంది ఉన్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయసు సుమారు 25 సంవత్సరాలు ఉంటాయి. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.